
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025



ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు

- ఈ కామర్స్ సైట్లలో భారీగా అక్రమాలు
- ప్లాట్‌ఫామ్, ఆఫర్, హ్యాండ్లింగ్ ఫీజుల పేరుతో భారీగా వడ్డన
- నో రీఫండ్.. రిటర్న్ ఆప్షన్ తొలగిస్తున్న వైనం..
- తప్పుడు ప్రొడక్టు వచ్చినా స్పందించని వైనం

థర్డ్ పార్టీలతో ప్రమాదం..

ఈ-కామర్స్ సంస్థలు నమ్మకస్తులైన అమ్మకందారులనే వినియోగదారుల ముందుకు తీసుకురావాలి. కానీ, ఇటీవల థర్డ్ పార్టీ అమ్మకందారులను కూడా తీసుకువస్తున్నాయి. వారు ఇచ్చే ఆఫర్లను బ్యానర్లుగా కూడా ప్రమోట్ చేస్తున్నాయి. ఈ కారణంగా ఎక్కువ మంది వాటి ఉచ్చులో పడుతున్నారు. తీరా వారు ఆర్డర్ చేసుకున్న ప్రొడక్టు పాతది లేక.. రీ పర్చేజ్ రావడమో జరుగుతోంది. ఈ విషయం తెలియక చాలామంది వాటిని కొత్త వస్తువులుగా భావించి మోస పోతున్నారు. ఒకవేళ వాటిని గుర్తించినా.. రిటర్న్ చేయడానికి అవకాశం కూడా ఉండడం లేదు.



పండగల వేళ..పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు..

(నరసరావుపేట ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రముఖ పండుగలు దసరా, దీపావళి సందర్భంగా భారీ స్థాయిలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఈ రెండు పండగల సందర్భంలో రూ.200 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని అంచనా. అం దులో సుమారు రూ.150 కోట్లు ఆన్ లైన్ వ్యాపారమే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏడాది పాటు జరిగే వ్యాపారంతో సమానంగా ఈ రెండు పండగల సమయంలోనే జరుగుతుందంటే.. ఎంత భారీ స్థాయిలో వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారో ఇట్టే అంచనా వేయవచ్చు. సగటున ప్రతి వంద మంది కొనుగోలు దారుల్లో

(మిగతా 8వ పేజీలో)

ఈ-కామర్స్ సంస్థలు వచ్చిన తర్వాత జనం షాపులకు వెళ్లి వస్తువులు కొనడమే దాదాపుగా మానేశారు. స్మార్ట్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, నచ్చిన ప్లాట్‌ఫాంను ఎంచుకోవడం.. కావాల్సినవి ఆర్డర్ పెట్టుకోవడం.. వారం రోజుల్లో అవి మన గడప దగ్గరకు వచ్చి చేరడం జరిగిపోతోంది. ఈ సులభతర పద్ధతుల కారణంగా మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ కొనుగోలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు అన్ని బ్యాంకులు క్రెడిట్, డెబిట్ కార్డుల పేరుతో భారీ డిస్కౌంట్లు ఇస్తుండడంతో.. స్థానిక మార్కెట్లను పూర్తిగా మర్చి పోయారు. ఇదే ఈ-కామర్స్ సంస్థలకు వరమైంది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చిన కాడికి వినియోగదారులపై బాదుడు మొదలు పెట్టాయి. రకరకాల ఫీజుల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నాయి. రానున్న దసరా, దీపావళి పండగల సందర్భంగా వచ్చే డిస్కౌంట్ ఆఫర్లతో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవడం ఖాయం!

యూరియాకు.. డిమాండ్!

వర్షాలకు మరింత గిరాకీ..

- జిల్లాలో 43,621 టన్నుల విక్రయం
- ప్రస్తుతం 4,800 టన్నుల నిల్వలు
- నెలాఖరుకు 4 వేల టన్నుల దిగుమతి



నరసరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో యూరియా వినియోగం పెరిగింది. భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు నిలిచిపోతోంది. నీరు పొలం నుంచి బయటకు పంపి.. ఉరకెత్తకుండా పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇందుకు యూరియాను వినియోగిస్తున్నారు. దీంతో ఈ ఎరువుకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో సంబంధిత అధికార యంత్రాంగం అప్రమత్తమై యూరియా సమస్యలు తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వర్షాలు కొనసాగుతుండటంతో అటు అన్నదాతలు, ఇటు వ్యవసాయ శాఖ యంత్రాంగంలో ఆందోళన నెలకొంది.


ఎత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు

ఎరువుల నిల్వలు ఇలా..

అయితే యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అంచనాలకు మించి యూరియా విక్రయాలు జరిగాయి. ఇప్పటి వరకు 43,621 టన్నుల యూరియా విక్రయాలు జరిగినట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది. జిల్లాకు 48,421 టన్నులు యూరియా సరఫరా చేశారు. ప్రస్తుతం 4,800 టన్నుల యూరియా నిల్వలు జిల్లాలో ఉన్నాయి. ఈ నెలాఖరులోపు ఇంకా 4,000 టన్నుల యూరియా జిల్లాకు దిగుమతి కానున్నట్టు వ్యవసాయ శాఖ జేడీ ఎం.జగ్గారావు తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, వ్యాపారుల ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇతర ఎరువుల నిల్వలు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయి. డీఏపీ 7,844 టన్నులు, ఎంవోపీ 2,012, కాంప్లెక్స్ ఎరువులు 27,461, ఎస్ఎస్‌పీ 2,247 టన్నుల నిల్వలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ఈ నెలాఖరుతో ముగియనుంది. సాధారణ పంటల విస్తీర్ణం 3,85,927 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3,43,475 ఎకరాల్లో అంటే 89 శాతం పంటలు సాగు చేశారు. పత్తి, వరి, కంది, మొక్కజొన్న, మిరప పంటలను ప్రధానంగా రైతులు సాగు చేశారు.

నాలుగు మండలాల్లో భారీ వర్షాలు

జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నాలుగు మండలాల్లో భారీ వర్షాలు కురిసినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. మాచర్లలో 36.6, వెల్దుర్తిలో 43.2, బెల్లంకొండలో 43.6, సత్తెనపల్లిలో 53.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇతర మండలాల్లో సాధారణ వర్షాలు కురిశాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ సూరజ్

జాతీయ రహదారి విస్తరణకు.. 344.31 హెక్టార్ల సేకరణ

- సమీక్షలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి(544డీ) విస్తరణకు భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణపై కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. వినుకొండ నుంచి గుంటూరు వరకు రహదారి విస్తరణకు 344.31 హెక్టార్ల భూమి అవసరమని పేర్కొన్నారు. నాలుగు లేన్ల రహదారి విస్తరణ పల్నాడు జిల్లా పరిధిలో 53.91 కి.మీ, బాపట్ల జిల్లాలో 18.19 కి.మీ జరుగుతుందన్నారు. రహదారి విస్తరణలో ఆరు బైపాస్‌లు ప్రతిపాదించారు. భూ సేకరణ ప్రక్రియతో పాటు రహదారి నిర్మాణానికి డీపీఆర్ రూపొందించనున్నారు. వ్యయం రూ.2,605 కోట్లుగా అంచనా వేశారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) విజయవాడ - గుంటూరు - తెనాలి పట్టణాల చుట్టూ గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్ 189.90 కి.మీ పొడవున ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు నిర్మాణానికి రూ.16,310 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇది పల్నాడు జిల్లాలో 19.93 కి.మీ ఔటర్ రింగ్ రోడ్డు వస్తుందని చెప్పారు. సమావేశంలో జేసీ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో ఏకా మురళీ, ఆర్డీవోలు మధులత, రమాకాంతరెడ్డి, ఎన్‌హెచ్ అధికారి పార్వతీశం పాల్గొన్నారు.

పిల్లిని పెనవేసుకున్న కొండచిలువ..!

కొట్టి చంపిన స్థానికులు



వినుకొండటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొండచిలువల భయం అధికమైంది. సోమవారం 15 అడుగుల కొండ చిలువ పిల్లిని పెనవేసుకోవడంతో.. స్థానికులు దానిని కొట్టి చంపారు. ఈ ఘటన పట్టణంలోని 22వ వార్డులో చోటుచేసుకుంది. కొండ మెట్ల బజారు సమీపంలోని అప్పయ్యకుంట వద్ద వారం రోజులుగా కొండచిలువ సంచరిస్తోంది. ఆదివారం రాత్రి ఒక కోడిని మింగేస్తుండగా.. స్థానికులు దాడి చేయడంతో అదృష్టవశాత్తూ తప్పించుకుంది. మరుసటి రోజు ఉదయం అదే ప్రాంతానికి ఒక పెంపుడు పిల్లి వెళ్లడంతో.. దానిని పెనవేసుకుంది. పిల్లి అరుపులు గ్రహించిన స్థానికులు అక్కడికి చేరుకొని కొండ చిలువను చంపేశారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్‌కు సమాచారం ఇవ్వడంతో.. మున్సిపల్ సిబ్బంది సాయంతో కొండ చిలువను అక్కడి నుంచి తొలగించారు. గడిచిన కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ఇప్పటికే నాలుగైదు కొండ చిలువలను చంపేశామని స్థానికులు చెబుతున్నారు. కొండకు ఆనుకొని ఉండటంతో ఇక్కడి అప్పయ్యకుంటలో పడి ఓ బాలుడు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. మున్సిపల్ అధికారులు ఆ ప్రాంతంలోని అప్పయ్యకుంటతో పాటు ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి.. పాముల బారి నుంచి తమను కాపాడాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

చిత్తశుద్ధి లేని ఆర్భాటం!

- నత్తనడకన వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్మాణ పనులు
- గత ప్రభుత్వం నిధులివ్వక తీవ్ర జాప్యం..

పిడుగురాళ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యకళాశాల, ఆసుపత్రి నిర్మాణ విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటమే కానీ, చిత్తశుద్ధి ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు. కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా రూపాయి కూడా విడుదల చేయకుండా.. నిర్మాణాలపై పర్యవేక్షణ పూర్తిగా పక్కన పెట్టింది. కనీసం 40 శాతం కూడా పనులు పూర్తికాకుండానే.. ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభోత్సవం నిర్వహించి..ప్రచారం చేసుకుంది. ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లలో పూర్తి కావాల్సిన నిర్మాణ పనులను అధికారంలో ఉన్న మూడున్నరేళ్లు పట్టించుకోని వైసీపీ నేతలు..నేడు నానా యాగీ చేస్తూ.. మొసలి కన్నీరు కారుస్తున్నారు.

నిధులు లేక తటపటాయింపు..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 మే 31న నాటి సీఎం వైఎస్ జగన్ పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ మొదట్లో పనులు ప్రారంభించేందుకు కొన్నాళ్లు తటపటాయించింది. ఆ తర్వాత పెద్దల ఒత్తిడితో పనులు


అసంపూర్తిగా మెడికల్ కళాశాల భవనాలు

ప్రారంభించింది. బ్రాహ్మణపల్లి సమీపంలోని కామేపల్లి రెవెన్యూ గ్రామంలో సుమారు నలభై ఏడున్నర ఎకరాలు వైద్య కళాశాలకు భూమిని పలువురు రైతుల వద్ద కొనుగోలు చేశారు. ఈ కొనుగోళ్ల వ్యవహారంలోనూ పెద్ద ఎత్తున నగదు చేతులు మారాయని, భూములు కోల్పోయిన రైతులు వాపోయారు.

రెండున్నరేళ్లలోనే పూర్తి కావాలి

వైద్యకళాశాల నిర్మాణం మొదలైన కొద్ది రోజులకే.. బిల్లుల చెల్లింపు నత్తనడకన ఉండడంతో.. కాంట్రాక్టర్ పనులను పక్కన పెట్టారు. అప్పటి నుంచి ఆ పనులన్నీ ఆగుతూ.. సాగుతూ.. అన్నట్లు సాగిపోతున్నాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం మూడేళ్లకు పైగా ఉన్నా.. సరైన ప్రణాళిక లేక పనులు మందకొడిగా సాగాయి. కనీసం నిర్మాణాల పురోగతిపై అప్పటి శాఖ మంత్రి రజని సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు. మొత్తం కళాశాల భవనాల నిర్మాణం 38 శాతం మాత్రమే పూర్తయ్యిందని ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పలుమార్లు స్పష్టం చేశారు. మెడికల్ కళాశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలంటే మరో రెండున్నరేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం వుంద ని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కూటమి చిత్తశుద్ధి..

కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాలల నిర్మాణాలపై పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షలు నిర్వహించారు. నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించి.. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.


ప్రజల్లో వైసీపీ చులకన..

ఓట్ల రాజకీయం కోసం 35 శాతం కూడా పూర్తికాని మెడికల్ కళాశాలను ఏ విధంగా ప్రారంభోత్సవం చేశారని వైసీపీ నేతలను పల్నాడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు మెడికల్ కళాశాల పనులు పూర్తిచేయాలని వారి నిరసన ప్రదర్శనలు చూసి.. అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో!

నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు

- గత టీడీపీ హయాంలో నిరంతరాయంగా ప్రక్రియ
- వైసీపీ రాకతో ఆ విధానానికి స్వస్తి
- కూటమి ప్రభుత్వం రాకతో లబ్ధిదారుల్లో ఆశలు
- కార్యాలయాలకు వెల్లువలా దరఖాస్తులు, వినతులు
- కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఆశావహులు
- నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు



సత్తెనపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం కొండంత ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛనుకు దూరమైన అనేక మంది కూటమి ప్రభుత్వం రాకతో తమకు అవకాశం వస్తుందన్న ఆశతో 15 నెలలుగా ఎదురు చూస్తున్నారు. నిరంతరాయంగా పింఛను దరఖాస్తులు, వినతులు వెల్లువలా ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముంచెత్తుతున్నాయి.

నాడు అలా.. ఇప్పుడు ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన పింఛను కోసం దరఖాస్తు చేసుకునే వీలుండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పొందే అవకాశం కలిగేది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధానాన్ని తెర మీదకి తెచ్చింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని చెప్పింది. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆరు నెలలకు జాబితా రూపొందించిన దాఖలాలు లేవు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతిలో ప్రతి నెలా పింఛను దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందని అందరూ భావించారు. కానీ, ఆ ఊసే లేదు.

బాధితులకు న్యాయమెప్పుడు..?

గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్ల నమోదును నిరంతర ప్రక్రియగా చేస్తే.. వైసీపీ ప్రభుత్వం పింఛనుదారులను ఘోరంగా వంచిస్తూ నిబంధనల పేరుతో వడపోత మొదలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్సు చెల్లించారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, నాలుగు చక్రాల వాహనం ఉందని, పరిమితికి మించి ఇళ్ల స్థలాలు, పొలాలు ఉన్నాయన్న నెపంతో వేలాది మందిని పింఛను పథకానికి అనర్హులను చేసి తొలగించింది. ఇలా ఒకసారి తొలగిస్తే వారికి మళ్లీ అవకాశం రావడానికి ఆరు నెలలు పడుతుంది. అలా కోల్పోయిన పింఛన్లు వైసీపీ హయాంలో తిరిగి వచ్చిన దాఖలాలు లేవు.

కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే పింఛనును రూ. 3 నుంచి 4 వేలకు పెంచింది. దానికి తోడు బీసీ, ఎస్సీ, ఎస్టీ పింఛనుదారుల వయోపరిమితిని 50 ఏళ్లకు తగ్గిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఉన్నారు. దీంతో వారంతా కొత్త నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో సుమారు 50 వేల మంది వరకూ అర్హులైన వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్నారు.


పిడుగురాళ్లలో కన్యకాపరమేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి అమ్మవారు

ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

నరసరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో అమ్మ వార్లకు వివిధ అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నరసరావుపేట పట్టణంలోని గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి బాల అలంకరణ, శృంగేరి శంకర మఠంలో శారదాంబ బ్రహ్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

'బ్లాక్ బర్లీ' నిషేధంపై అవగాహన కల్పించాలి

మండల స్థాయిలో కమిటీలు: కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలో ఆమె మాట్లాడారు. పొగాకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ, అపరాలు సాగు చేయాలని రైతులకు తెలియజేయాలన్నారు. మండల, డివిజన్ స్థాయి కమిటీల ద్వారా బ్లాక్ బర్లీ పొగాకు సాగు నిషేధంపై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. కమిటీల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, న్యాయశాఖ, అభ్యుదయ రైతులు సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు. పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ద్వారా బ్యాంకు రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సమావేశంలో డీఏఓ జగ్గారావు, డీపీఎం అమలకుమారి. ఏడీఏలు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు రేపు గుంటూరులో రిపోర్ట్ చేయాలి: డీఈవో

గుంటూరు విద్య సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్‌లో ఉన్న ఆంధ్ర ముస్లిం కళాశాలలో బుధవారం ఉదయం 11 గంటలకు రిపోర్టు చేయాలని డిఈవో సీవీ రేణుక తెలిపారు. అక్కడకు వస్తే ఈ నెల 25న జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులలో ఒకరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. 25వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులతో ఆంధ్ర ముస్లిం కళాశాలకు రావాలని సూచించారు. వారిని ప్రత్యేక బస్సుల్లో సచివాలయం సమీపంలో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి తీసుకెళ్తామని డిఈవో తెలిపారు.

ట్విట్టర్‌లో సమస్య పై స్పందించిన మంత్రి నారా లోకేశ్

సత్తెనపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘు రామ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో రోడ్ల దుస్థితి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యను తీర్చాలని ఆ ప్రాంతానికి చెందిన నందా సాంబశివరావు ట్విట్టర్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన నారా లోకేశ్.. సత్తెనపల్లి నుంచి నరసరావుపేట రోడ్డు మార్గ నిర్మాణం త్వరలో జరగనుందని, రఘు రామ్ నగర్ ప్రాంతంలోని ఎక్స్‌టెన్షన్ ఏరియాలో ఉన్న రోడ్లను కూడా మరమ్మత్తులు చేస్తామని ట్విట్టర్‌లో తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత మంత్రితో కూడా సమస్యపై మాట్లాడినట్టు లోకేశ్ పేర్కొన్నారు.

పశ్చిమడెల్టాకు 7,004 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు సోమవారం 5,009 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హై లెవెల్ చానల్‌కు 200 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1,356 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 524 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 225 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 399 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1,173 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,785, మోడల్ ధర రూ.10,650 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,325, గరిష్ఠ ధర రూ.10,650, మోడల్ ధర రూ.10,525 పలికాయి.

25,802 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 28,258 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 25,802 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,161 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13500	334	10500	14500
273	----	---	నెంబరు. 5	10000	13800
341	10000	15200	273	---	---
4884	----	----	341	10000	15300
సూపర్ 10	---	----	4884	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	---	---
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7200

గురజాడ గృహాన్ని స్మృతి చిహ్నంగా అభివృద్ధి పరచాలి

● అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పక్కన మాజీ మంత్రి వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, లక్ష్మణ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దీనావస్థలో ఉన్న మహాకవి గురజాడ అప్పారావు గృహాన్ని అభివృద్ధి పరిచి సాహితీవేత్తలకు, సామాజిక మార్పు కోసం తపిస్తున్న ఔత్సాహికులకు స్మృతి నిలయంగా తీర్చిదిద్దాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో పెనుగొండ లక్ష్మీనారాయణ విలేకరులతో మాట్లాడారు. సాంస్కృతిక స్థాయి లోపించిన పాలక పక్షాలతో తెలుగు సాహిత్యానికి, సమాజానికి విఘాతం కలుగుతుందని అన్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక లాంటి రాష్ట్రాలు ప్రాచీన రచయితలను గుర్తు చేసుకుంటూ గౌరవిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో గురజాడ, కందుకూరి, గిడుగు, జాషువా లాంటి మహనీయులను విస్మరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించకపోతే సమాజం పతనమవుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, గురజాడ జయంతిని ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని, ఆయన పేరుతో సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నవంబరు 30న విజయనగరంలో గురజాడ వర్ధంతి రోజు సాహితీ ప్రియులతో, పౌర సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల గురజాడ అప్పారావు గృహాన్ని అభివృద్ధి చేస్తామని, స్మారక చిహ్నాన్ని నిర్మిస్తామని ప్రకటించడం హర్షదాయకమన్నారు. రాజధాని అమరావతిలో నిర్మించ తలపెట్టిన కేంద్ర గ్రంథాలయానికి గురజాడ పేరు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కన్నా మాస్టర్, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, సామాజిక విశ్లేషకుడు టి. ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

నరసరావుపేట కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



బ్రహ్మయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న అధికారులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో జొన్నలగడ్డకు చెందిన చట్టు బ్రహ్మయ్య అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. తన ఇంటి స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి వేరే వారి పేరు మీద రాశారని, ఈ విషయాన్ని తాను గతంలో చాలాసార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేకపోయిందని చట్టు బ్రహ్మయ్య తెలిపారు. దాంతో మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశానని చెప్పాడు. అయితే పోలీసులు వెంటనే స్పందించి చట్టు బ్రహ్మయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రితో చికిత్స పొందుతున్న అతన్ని తాహసీల్దార్ కే వేణుగోపాలరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, ఇతర అధికారులు పరామర్శించారు.

వ్యక్తిగత సమస్యలతోనే : అధికారులు

వ్యక్తిగత సమస్యలతోనే చట్టు బ్రహ్మయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అధికారులు వివరణ ఇచ్చారు. అతను పురుగుల మందు తాగి జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చాడని చెప్పారు. అతన్ని ఆసుపత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో తక్షణం చికిత్స అందటంతో బ్రహ్మయ్య కోలుకుంటున్నాడని చెప్పారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

117 మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు

మంత్రి లోకేశ్‌కు అభ్యర్థుల ధన్యవాదాలు



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు నియోజకవర్గ వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిభ, అవగాహన, ఇంటర్వ్యూల ఆధారంగా 117 మందికి ఉద్యోగాలు లభించాయి. 12కు పైగా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా సంస్థల్లో రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు జీతం లభించే ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు స్థానిక టీడీపీ నాయకులు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ప్రతి నెలా నియోజకవర్గ పరిధిలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే.సంజీవరావు, కళాశాల ప్రిన్సిపాల్ గొడవర్తి నాగేశ్వరరావు, టీడీపీ మంగళగిరి, దుగ్గిరాల మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, కేసంనేని శ్రీఅనిత, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేశ్, షేక్ రియాజ్, నేతలు వాసా పద్మ, మల్లవరపు వెంకట్, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ ఇచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు



డీఎంహెచ్‌వో డాక్టర్ రవికి వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ రవికి సమ్మె నోటీస్ ఇచ్చారు. పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవికి సోమవారం రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చి ముందస్తు నోటీసు అందజేశారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు సమ్మె కార్యాచరణను ప్రకటించారు. సమ్మె కారణంగా వైద్య సేవల్లో అంతరాయం కలిగితే, దాని పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని వారు పేర్కొన్నారు. డీఎంహెచ్‌వోను కలిసిన వారిలో ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మమతా ప్రియా, కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పోక్సో కేసులో పది సంవత్సరాల జైలు శిక్ష

నాదెండ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మందారపు శివ ప్రసాదు అనే వ్యక్తికి పోక్సో కేసులో పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ 2వేల జరిమానా పడింది. ఈ మేరకు శివ ప్రసాదుకు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి షమ్మి పర్వీన్ సుల్తాన బేగం సోమవారం తీర్పునిచ్చారు. 2022 మే 28న రాజీవగాంధీ కాలనీకి చెందిన ఒకరు ఇచ్చిన ఫిర్యాదు చేయగా డీఎస్పీ విజయ భాస్కర్ విచారణ జరిపారు. ఈ కేసులో శివ ప్రసాదు దోషిగా తేలటంతో ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్టు నాదెండ్ల ఎస్సై పుల్లారావు తెలిపారు.

భూ వివాదంలో ఎస్ఐ పుల్లారావు బెదిరింపులు

● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

నాదెండ్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యాయ స్థానం తనకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చినా భూమి వదిలి వెళ్ళాలని నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు తనను బెదిరిస్తున్నారని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన కావూరి శివయ్య సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన మేనమామ పాములపాటి గోపయ్య ఇచ్చిన వీలునామా ప్రకారం నాదెండ్ల గ్రామ పరిధిలో సుమారు ఎకరం ఆరు సెంట్ల భూమి తనకు వచ్చిందన్నారు. కాగా గోపయ్య బంధువైన పాములపాటి వెంకట శివరావు పోర్జరీ దస్తావేజును సృష్టించి ఆ భూమిని తన తల్లితో 2010లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అదే భూమిని ఆయన ప్రస్తుత జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావుకు తాకట్టు పెట్టారన్నారు. ఈ విషయమై 2012లో కోర్టుకు వెళ్ళగా 2022లో తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించారు. రెవెన్యూ అధికారులు ఆ భూమిని తన పేరుతోనే అడంగల్, 1బీలో ఎక్కించారని వివరించారు. కాగా, ఎస్ఐ పుల్లారావు 20 రోజుల క్రితం తనను పిలిచి భూమి వదిలి వెళ్ళకపోతే ఎస్సీ ఎస్టీ కేసు బనాయించి ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించారని ఆరోపించారు. ఎస్ఐ పుల్లారావు, వెంకట శివ, చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన కట్టా శౌరి (నాగేశ్వరరావు) తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారి నుంచి తనను కాపాడాలని వేడుకున్నాడు.

అచ్చంపేట డాక్టర్ రాజేశ్ కుమార్ సస్పెన్షన్

అచ్చంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీ రవి సోమవారం తెలిపారు. ఆదివారం ఆస్పత్రిలో సకాలంలో వైద్యం అందక ఓ రోగి మృతి చెందినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేసినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు.

సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు: టీడీపీ నేతలు

కారంపూడి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కారంపూడి పల్నాటివీరుల తిరునాళ్లను ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించిన సీఎం చంద్రబాబుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత సంవత్సరం తిరునాళ్లను ఘనంగా నిర్వహించిన ఘనత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు నాగారపు రామకృష్ణ, చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, బాలు నాయక్, నాగులునాయక్, పలిశెట్టి రాఘవ, గుర్రపుసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● పిడుగురాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం నుండి రెండురోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు పిడుగురాళ్ల ఎంపీడీఓ కె.వాణి తెలిపారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి ఎద్దువాగు ఆక్రమణలను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెన్నకేశవరావు అధికారులను కోరారు. విలేకరులతో మాట్లాడుతూ వడ్డవల్లి శివారులోని శాలివాహననగర్, సుందరయ్యకాలనీ, నాగన్నకుంట, వెంకటపతి కాలనీలు ఎద్దువాగు ఆక్రమణలతో భారీవర్షాలకు నీట మునుగుతున్నాయని తెలిపారు.

● రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెంలో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రవితేజనాయక్ 153 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.పేతురు, టి.శ్రీనివాసరావు, కూటమినాయకులు శివకుమార్, ఆరోగ్యపర్యవేక్షకులు ఉన్నారు.

● రెంటచింతల: సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్‌ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ ఉద్యోగుల నిరసన సోమవారం ఐదోరోజుకు చేరింది. ప్లకార్డులతో మెయిన్‌గేట్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ధర్మారావు, సుగుణరావు, రామయ్య, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

● రెంటచింతలలోని వైఆర్‌ఎస్ హైస్కూల్‌లో అన్‌ఎయిడెడ్ టీచర్లుగా పనిచేస్తున్న బద్దిగం ఈశ్వరరెడ్డి, నారాయణం విజయ్‌కుమార్‌లకు కృష్ణాజిల్లా డిప్యూటీ కలెక్టర్ కట్టమూరి చంద్రశేఖరరావు రూ.72వేలను వేతనం అందచేసినట్లు హెచ్‌ఎం చంద్రశేఖరరావు, కరస్పాండెంట్ సైదయ్య చెప్పారు. చంద్రశేఖర్ ఈ పాఠశాల పూర్వ విద్యార్థని గుర్తుచేశారు.

● మాచర్ల: మండలంలోని నాగులవరానికి చెందిన ఎలిశమ్మ తమ పూర్వీకుల నుంచి సాగుచేస్తున్న గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.957లోగల 3 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాఇవ్వాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను కోరారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో దళిత బహుజన సంక్షేమసేవాసంఘం వ్యవస్థాపకుడు ప్రసాద్ ఆధ్వర్యాన ఆమె తన అర్జీని అందించారు.

● వెల్దుర్తి: మండలంలోని పట్లవీడులో నూతన స్మార్ట్ కార్డులను టీడీపీ నేతలు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బత్తుల ఏడుకొండలు, బీరవల్లి అక్కిరెడ్డి, బోయన చిన్నలింగయ్య, కొండా మునలయ్య, జి లింగారావు, షేక్ గఫూర్, బాషా, రాచూరి రఫీ, తాటికొండ జోజిరెడ్డి, వీఆర్వో, డీలర్ ఉప్పలపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

● కారంపూడి: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఇనుపరాజుపల్లిలో డ్రెయిన్‌ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

● చింతపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన మహిళలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విజయనాయక్, అంజిరెడ్డి, సర్పంచ్ మాధవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, మల్లికార్జునరావు, సూపర్‌వైజర్ రసూల్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

వైసీపీ డీఎన్‌ఏలోనే హత్యా రాజకీయాలు

● అసెంబ్లీకి రాజీనామా చేసి ఇళ్లలో కూర్చోండి
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఓట్లేసి గెలిపిస్తే అసెంబ్లీకి రాకుండా డుమ్మా కొడుతున్నారు.. వైసీపీ డీఎన్‌లోనే హత్యారాజకీయాలు ఇమిడివున్నాయి.. ఐదేళ్ల బాధ్యతలు విస్మరించి చంపడం, నరకడానికి అలవాటుపడ్డ వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలుచేసి ఇళ్లకే పరిమితమైతే మంచిదని.. అసెంబ్లీకి వస్తే జరిగిన పాపాలన్నింటిని ఎత్తి చూపుతారనే కుట్రతో రాకుండా కాలయాపన చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. సోమవారం అసెంబ్లీకి వెళ్తూ ఎమ్మెల్యే జాతీయరహదారి వద్ద విలేకరులతో మాట్లాడుతూ జగన్ పరామర్శలు పాదయాత్రల పేరుతో విధ్వంసం సృష్టించడానికి కుయుక్తులు పన్నుతున్నాడన్నారు. గతంలో పరామర్శల పేరుతో బెట్టింగ్, గంజాయి బ్యాచ్‌ను వెంటేసుకుని తిరిగాడన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ జగన్ నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తాడనే దానికి వివేకానందరెడ్డి హత్యే నిదర్శనమన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం చంద్రబాబు పెద్దకొడుకుగా శాంతిభద్రతలను కాపాడడం ప్రజలకు న్యాయంచేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, ప్రభురాజ్, మండలపు హనిమిరెడ్డి, తాడపనేని కోటేశ్వరరావు, పోట్ల సైదారావు, గొట్టం సర్వేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్లు తుమ్మా జోజిరెడ్డి, అల్లం నాగలక్ష్మి, నాగయ్యచౌదరి, మాజీ ఎంపీపీ నాగమ్మనర్సిరెడ్డి, మాజీ డీసీచైర్మన్ నల్లబిరుదు నరసింహారావు, పోట్ల సతీష్, శీలంనేని సోదరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు నియోజకవర్గానికి ఎగువ నుంచి వరద నీరు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గం నదీ పరివాహక ప్రాంతం కావటంతో ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల కారణంగా వాగుల్లో నీరు రోడ్లపైకి రావటమే కాకుండా వేల ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయన్నారు. రోడ్లు కొట్టుకుపోయి యాక్సిడెంట్‌లు జరగటమే కాకుండా రైతులు నష్ట పోయారన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి వాగులు, చెరువుల్లో పూడిక తీసి వరదల నుంచి రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ యార్డుల్లో ఉన్న నిధులతో గ్రామాల్లోని డొంక రోడ్లను నిర్మించుకొనేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు



పిడుగురాళ్ల: బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



సత్తెనపల్లి: వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు



నకరికల్లు: బాలా త్రిపుర సుందరిగా నరసింగపాడులో గంగా అన్నపూర్ణాదేవి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని అన్ని దేవాలయాల్లో సోమవారం దేవీనవరాత్రుల వేడుకలు ప్రారంభమయ్యాయి. వాసవి అమ్మవారి దేవాలయంలో కన్యకాపరమేశ్వరిగా, కనకదుర్గ దేవాలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో, శ్రీషిరిడీసాయి దేవాలయంలో, బొడ్రాయి సెంటర్‌లోని మహాలక్ష్మీ దేవాలయంలో, గంగమ్మతల్లి దేవాలయంలో, భగవాన్ సత్యసాయి దేవాలయంలో దేవీనవరాత్రులు ప్రారంభమయ్యాయి. గుత్తికొండబిలం రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బాలత్రిపురసుందరీదేవిగా అమ్మవారిని అలంకరించారు. బ్రహ్మంగారి దేవాలయం, శివాలయంలో, నాగులగుడిలో ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, యేలూరి చంద్రం, కూనాగు శేషారావు, కొత్తూరి ఆంజనేయులు, కొక్కెర కొండలు, గుదె నాగసతీష్, యేలూరి రామాంజనేయులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పిడుగురాళ్లలోని స్కాలర్స్ స్కూల్‌లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ జి శ్రీనివాసరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థినులు దుర్గాదేవి వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. దేవీ నవరాత్రులు సందర్భంగా పట్టణంలోని కనకదుర్గదేవి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన భవనాశి ఆంజనేయులు, నరసింహారావు, యల్లారావు సోదరులు, కుటుంబసభ్యులు దేవాలయంలో పూజా కార్యక్రమాలలో పాల్గొని అనంతరం 5వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● దాచేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. దాచేపల్లిలోని శ్రీవీర్లంకమ్మ దేవస్థానం, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభించారు. పండితులు వేద పారాయణం ప్రారంభించారు. దాచేపల్లి సహకారసంఘ అధ్యక్షులు తంగెళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఉత్సవాలు జరుపుతున్నారు. గ్రామాల్లో బతకమ్మలను ఏర్పాటుచేసి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు.

● మాచవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మాచవరంలోని శ్రీభ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీభ్రమరాంబికదేవిగా అమ్మవారికి అలంకరణ చేశారు. మొదటి రోజు భక్తులు అధికసంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



పిడుగురాళ్ల: కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో అన్నదానం చేస్తున్న భవనాశి ఆంజనేయులు, నరసింహారావు, యల్లారావు

● సత్తెనపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని వాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఉత్సవాలను ప్రారంభించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు బాల త్రిపురసుందరిగా దర్శన మిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని సందర్శించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లుచేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉత్సవాలనుప్రారంభించారు.

● నకరికల్లు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకాలు చేశారు. నరసింగపాడులో గంగా అన్నపూర్ణదేవి, కుంకలుగుంటలోని భద్రకాళి అమ్మవార్లు బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. చేజర్లలో గంగాభ్రమరాంబ పార్వతి అమ్మవారు బాల అలంకారంలో దర్శనమిచ్చారు. చండీ హోమం, రుద్రహోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ధర్మకర్త పి.శ్రీనివాసశర్మ పర్యవేక్షించారు.

● మాచర్ల రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్ 2వ లైను శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా మహిళా భక్తులు కుంకుమపూజలు నిర్వహించారు. సాగి శ్రీనివాసరావు, నేలవల్లి శ్రీను, చేపూరి రమణారావు పర్యవేక్షించారు.

● రెంటచింతల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువ జామునుంచే వివిధ ఆలయాలకు భక్తులు చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిషాసుర మర్థనిగా ఆయా ఆలయాల్లోని అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సత్రశాలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత అమ్మవారు, శ్రీవాసవి కన్యకపరమేశ్వరీ, జంక్షన్ శ్రీనకదుర్గ, తిరుపతమ్మ ఆలయం, శ్రీచౌడేశ్వరీ పలు ఆలయాలు భక్తులతో నిండాయి. జంక్షన్‌లో అన్నదానం చేశారు. ఆయా ఆలయాల చైర్మన్లు కట్టమూరి నాగేశ్వరరావు, ఏచూరి సాంబశివరావు, గుండా వెం కటశివయ్య, పెద్దిశెట్టి, ఈవో రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● కారంపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దేవీ శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం వనబాలగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● గురజాలటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సర్వాంగ రజిత కవచధారణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతపాటేశ్వరి అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

● విజయపురిసౌత్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక మెయిన్ బజారులో కనకదుర్గ అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గభవాని యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● దుర్గి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో సోమవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదుర్గామల్లేశ్వరి ఆలయంలో దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు.

● అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలలో ప్రారంభమైన శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలలో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించారు. ప్రధానంగా బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని రజిత కవచధారిణీగా అలంకరించారు. దీంతో పాటు శరన్నవరాత్ర కలశస్థాపన, త్రికాలార్చన కుంకుమపూజ, సప్తశతి పారాయణ కార్యక్రమాలను ఆలయ వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. అమ్మవారిని దర్శించిన భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. కోదండరామాలయం, కన్యకాపరమేశ్వరీ, సాయిబాబా, బాలాత్రిపురసుందరీ ఆలయాలతో పాటు వడియరాజుల కాలనీ, సుందరయ్య నగర్, గోపాల్‌నగర్‌లలో దుర్గాదేవి బొమ్మలను ఏర్పాటు చేసి శరన్నవరాత్ర పూజలు చేస్తున్నారు. అత్తలూరు, లింగాపురం, కర్లపూడి, ఉంగుటూరు, నెమలికల్లు, దిడుగు గ్రామాలలో కూడా దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి.

● అచ్చంపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అచ్చంపేలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో అమ్మవారిని సీతాదేవిగా అలంకరించారు.

● బెల్లంకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):బెల్లంకొండలో మహాలక్ష్మిదేవి నిలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున మహాలక్ష్మీదేవిని బాల త్రిపురసుందరిగా అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● క్రోసూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సహస్ర నామార్చనలు, కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారికి వ్యాపార వేత్త చుండూరి సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం బతకమ్మ ఉత్సవం ప్రారంభమైంది. ఉత్సవాలను ఆలయ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

● పెదకూరపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష అలంకారాలతో అమ్మవారి అలంకరణలు జరగనున్నాయి. మండలంలోని 75 తాళ్ళూరు అన్నపూర్ణాంబిక సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బాల త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. పెదకూరపాడులోని బొమ్మలగుడి రామాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్టేట్ ఆడిట్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.వెంకట సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.



కారంపూడి: వనబాలగా దర్శనమిస్తున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు



విజయపురిసౌత్: బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గ



బెల్లంకొండ: బాలా త్రిపురసుందరిగా మహాలక్ష్మిదేవి



అచ్చంపేట: అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

సంక్షిప్తం...

● పిడుగురాళ్ల: సోమవారం జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. హైకోర్టు జీవో నెం.10/2025 ప్రకారం సంతాపసభ ఉదయం 10.30గంటలకు బదులు సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించాలని పేర్కొనడంపై నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, డి.చెన్నయ్య, కె.వెంకటేశ్వర్లు, బి.దాసు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రశాంత్‌నాయక్, రామకృష్ణ, ఎం.జాకబ్, పల్లవి, నవ్య, మాణిక్యం, లోకేశ్వరి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: 10/25 జీవోను హైకోర్టు ఉపసంహరించుకోవాలని కోరుతూ న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. కార్యక్రమంలో జి.అజయ్‌కుమార్, మణిబాబు, ఖాజావలి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, బాబూరావు, విజయకుమార్ పాల్గొన్నారు.

● నకరికల్లు: నానో యూరియాను వరిపంటపై పిచికారి చేయాలని ఏవో దేవదాసు సూచించారు. నకరికల్లు జీడీసీఎంఎస్‌లో, చల్లగుండ్ల, అడ్డరోడ్డు, నకరికల్లు, గుండ్లపల్లి, రూపెనగుంట్ల రైతులకు 19.8మెట్రిక్‌టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. జీడీసీఎంఎస్‌లో డీఏపీ 40 మెట్రిక్‌టన్నులు, పొటాషియం 13మెట్రిక్‌టన్నులు, 20-20-013రకం ఎరువు పదిటన్నులు అందుబాటులో ఉందన్నారు. కుంకలగుంట-2 ఆర్‌ఎస్‌కేలో 19.8మెట్రిక్‌టన్నుల యూరియా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, రవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● క్రోసూరు: గ్రామాల్లో సొంత ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. క్రోసూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌లకు, పీఎస్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణనిచ్చారు.

● బెల్లంకొండ: ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో స్వస్థ నారి సశక్తి వైద్య శిబిరంలో క్యాన్సర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దీపిక, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, సీహెచ్‌వో మణికుమారి పాల్గొన్నారు.

● క్రోసూరు: మహిళలు వంటల్లో నూనెలు, ఉప్పు తగ్గిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకున్నవారవుతారని వైద్యాధికారి డాక్టర్ సిరిచందన అన్నారు. ఆవులవారిపాలెంలో స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ టి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నరసయ్య, పీసపాడులో టీడీపీ నాయకులు కంచేటి నరసింహారావు, ఆరోగ్య విస్తరణ అధికారి శ్యామ్‌సన్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 39.55 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఈఈ రాజు తెలిపారు. ఎగువనుంచి 2,89,300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టువద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకులద్వారా 400, పదిగేట్లద్వారా 2,97,300, మొత్తం 3,14,300 క్యూసెక్కులు దిగువకృష్ణకు విడుదలచేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమికి ఆరోగ్యం.. రైతులకు ఆదాయం

బెల్లంకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భూమి ఆరోగ్యంతోపాటు రైతులకు అదనంగా ఆదాయం వస్తుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలో బయోరిసన్స్ సెంటర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బయో రీసెర్చ్ సెంటర్‌ను ఆర్గనైజింగ్ డైరెక్టర్ కే విజయగౌరి సందర్శించారు.కార్యక్రమంలో అన్నపూర్ణ, వి.సీతారామిరెడ్డి, పవర్‌కుమార్, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

దాడిచేసిన నిందితులకు 14 రోజుల రిమాండ్

ముప్పాళ్ళ సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చాగంటివారిపాలెం వైన్‌షాపులో బాలునిపై దాడిచేసిన నిందితులు ఐదుగురిని అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండ్‌విధించినట్లు ఎస్‌ఐ సోమేశ్వరరావు సోమవారం తెలిపారు. చాగంటివారిపాలెంకి చెందిన కొణిదల శివప్రసాద్‌ను పాత గొడవల నేపథ్యంలో రెండురోజుల క్రితం అన్నపురెడ్డి మహేశ్వరరెడ్డి, పఠాన్ చాన్‌బాషా, బొరిగర్ల నాగరాజు, మదిర లక్ష్మారెడ్డి, బత్తుల వేణు, మరో ఇద్దరు చాగంటివారిపాలెంలోని మద్యం దుకాణం వాచ్‌మెన్ రూంలో బంధించి దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కేసు నమోదు చేసి ఐదుగురిని కోర్టులో ప్రవేశపెట్టామన్నారు.



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే కన్నా

పవన్ కల్యాణ్‌ను కలిసిన కన్నా

సత్తెనపల్లి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సచివాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై కన్నా ఆయనతో చర్చించారు.



సబ్‌జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ జియాఉద్దీన్

సబ్‌జైలు సందర్శన

సత్తెనపల్లి సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును సోమవారం జిల్లా న్యాసేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ జియాఉద్దీన్ సందర్శించారు. జైలులోని పరిసరాలను పరిశీలించారు. నిందితులకు అందుతున్న ఆహార పదార్థాలు, సేవలను అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, న్యాయవాది కోటేశ్వరరావు తదితరులున్నారు.



దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో సౌరశక్తి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కరరావు

దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో సౌరశక్తి ప్రారంభం

దాచేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హరితశక్తి వినియోగంలో ఇది ఒక ముందడుగు అని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. సోమవారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన నాలుగు యూనిట్ల సౌరశక్తి బ్యాటరీ వ్యవస్థను డీఎస్పీ ప్రారంభించారు. సీఐ భాస్కరరావు, ఎస్‌ఐలు పాపారావు, సౌదర్ రాజన్, తిరుపతిరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నడికూడి రైల్వేస్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న బోర్డు సభ్యురాలు రాధా

నడికూడి స్టేషన్‌ను సందర్శించిన రైల్వే బోర్డు సభ్యురాలు రాధా

దాచేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దక్షణ మధ్య రైల్వేబోర్డు సభ్యురాలు వంకా రాధా సోమవారం నడికూడి రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో క్యాంటీన్‌లు, పోలీసుస్టేషన్, వెయిటింగ్ హాల్, వాష్‌రూమ్స్ పరిశీలించారు. రైల్వే స్టేషన్ మాస్టరు, రైల్వేపోలీసు అధికారులతో మాట్లాడారు.


అమరావతి : రజత కవచంతో దర్శనమిస్తున్న బాలచాముండికా అమ్మవారు


పెదకాకాని : బాల త్రిపుర సుందరీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు


మంగళగిరి : ఎర్రచెరువు వద్ద కొలువైన శ్రీ కాళీమాత అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

● శ్రీ బాలాత్రిపురసుందరీదేవి రూపంలో అమ్మవారి దర్శనం
● దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

గుంటూరు/నరసరావుపేట/మంగళగిరి సిటీ/పెదకాని/ అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దసరా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలిరోజు పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారి అలంకారాలను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న శ్రీ కన్యకా పర మేశ్వరి ఆలయంలో అమ్మవారు తొలి రోజున శ్రీ బాలత్రిపుర సుంద రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరసరావుపేట పట్టణంలోని పాతూరు శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకారం చేశారు. అమరావతి శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని రజిత కవచధారిణిగా అలంకరించారు. పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి శ్రీ లక్ష్మీన్సింహస్వామి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.


నరసరావుపేట : శ్రీ శృంగేరి శంకర మఠంలో బ్రహ్మి అలంకారంలో అమ్మవారు


గుంటూరు : శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

విజ్ఞాన అమరావతి



● రాజధానిలో ప్రపంచ ఖ్యాతి సెంట్రల్ లైబ్రరీ

రాజధాని అమరావతి అంటేనే మరో ప్రపంచమన్న నానుడి ఇటీవలి కాలంలో బాగా ప్రబలమైపోయింది. ఇక్కడ ఏ నిర్మాణమైనా.. అది అంతర్జాతీయ ప్రమాణాలతో.. ప్రపంచ మేటిగా ఉండాలన్న లక్ష్యంగా సాగుతోంది. ఇపుడు తాజాగా రాజధాని అమరావతిలో అతి పెద్ద గ్రంథాలయం ఆవిర్భవించబోతున్నట్టు రాష్ట్ర విద్యా, ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ గ్రంథాలయం సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతుంది. ఈ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అయిదు నుంచి పదెకరాల స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటన చేసినా.. రాజధానిలో దానిని ఏ ప్రాంతంలో నిర్మిస్తున్నారనే అంశమై స్పష్టత ఇవ్వలేదు. అయితే అమరావతిలోని నవ నగరాల్లో ఒకటైన నాలెడ్జి సిటీలోనే దీనిని నిర్మించాల్సి ఉంటుంది. నాలెడ్జి సిటీ విస్తరించిన తుళ్లూరు, శాఖమూరు, ఐనవోలు, మల్కాపురం ప్రాంతాల్లోనే ఈ సెంట్రల్ లైబ్రరీ ఆవిష్కృతమయ్యే అవకాశముంది.

- రూ.150 కోట్లతో అద్భుతంగా నిర్మాణం
- జ్ఞాన కేంద్రంగా... టెక్నాలజీ హబ్‌గా..
- అత్యాధునిక వసతులతో రెండేళ్లలో పూర్తి..
- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతిలో ఏర్పాటుకానున్న ఈ సెంట్రల్ లైబ్రరీ దేశంలోనే అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించనుంది. ప్రస్తుతానికి కోల్‌కతాలో ఉన్న నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా అతిపెద్దదిగా ప్రాచుర్యంలో ఉంది. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ పబ్లిక్ లైబ్రరీ, తంజావూరులోని సరస్వతీ మహల్ లైబ్రరీ ఉన్నాయి. సరస్వతీ మహల్‌కున్న మరో అరుదైన ప్రాముఖ్యత దేశంలోని వివిధ ప్రాంతీయ భాషల్లో ఉన్న తాళపత్ర గ్రంథాలు ఇక్కడ కచ్చితంగా అందుబాటులో ఉంటాయి. అందుకే సరస్వతీ మహల్‌కు జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు అమరావతిలో రూపుదిద్దుకోనున్న సెంట్రల్ లైబ్రరీ కూడా అటు విస్తీర్ణంలోను, ఇటు కేటలాగ్‌లోనూ అతిపెద్ద గ్రంథాలయంగా ఆవిర్భవించడంతోపాటు అత్యాధునిక వసతులతో సాంకేతిక విలువలతో అగ్రగామిగా నిలవనుంది. మంత్రి లోకేశ్ మాటల్లో చెప్పాలంటే...దీనిని ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.


సెంట్రల్ లైబ్రరీ గురించి అసెంబ్లీలో ప్రకటన చేస్తున్న మంత్రి నారా లోకేశ్

అడుగులు పడింది ఇలా...

రాష్ట్రంలో సెంట్రల్ లైబ్రరీ ఆవశ్యకతను గురించి మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు రాష్ట్రంలో గ్రంథాలయాల పునర్వికాస ప్రక్రియ చాల ఆవశ్యమన్న విషయాన్ని బుద్ధప్రసాద్ మంత్రి లోకేశ్ వద్ద ప్రస్తావించారు. ఆయన సెంట్రల్ లైబ్రరీ అంశమై సానుకూలంగా స్పందిస్తూ గత ఆగస్టు 22న ఓ ప్రకటన చేశారు. తాజాగా అసెంబ్లీ సమావేశంలో మంత్రి లోకేశ్ మరోమారు సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు ప్రక్రియను వివరించారు. అమరావతిలో రూ.150 కోట్ల భారీ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రపంచ శ్రేణి గ్రంథాలయంగా దీనిని నిర్మిస్తామని చెప్పారు. త్వరలోనే నిర్మాణం ప్రారంభించి.. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. దీంతోపాటు రాష్ట్రంలోని అన్నీ గ్రంథాలయాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు మాన్యు స్క్రిప్ట్ కాపాడేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచే అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటూ.. రాబోయే ఆరుమాసాల్లోనే గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నామని లోకేశ్ సభలో వివరించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం ఉన్న 13 జిల్లా గ్రంథాలయాలతోపాటు నూతనంగా ఏర్పాటైన జిల్లాల కేంద్రాల్లో కూడా గ్రంథాలయాలను నిర్మిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఇప్పటికే చేపట్టిన మోడల్ లైబ్రరీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, అక్టోబరులో దానిని ప్రారంభిస్తామని చెప్పారు.

లైబ్రరీ ప్రత్యేకతలు ఎన్నెన్నో...

అమరావతిలో ఏర్పాటు కానున్న సెంట్రల్ లైబ్రరీ రాష్ట్ర ఖ్యాతిని మరింత ఇనుమడించేలా ఉండాలన్నది.. ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఇందుకోసం భవన నిర్మాణం మొదలు.. అందులోని సదుపాయాలన్నీ అత్యంత ఆధునికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆధునిక డిజిటల్ లైబ్రరీ, ఈ -బుక్స్ యాక్సిస్, ఇంటర్నెట్ ల్యాబ్స్, స్టడీ రూమ్స్, గ్రూప్ డిస్కషన్స్‌కు ఉపకరించేలా హాల్స్, ఆడియో అండ్ వీడియో విజువల్ రిసోర్స్ సెంటర్ల వంటి అన్నీ వసతులను ఇక్కడ అందుబాటులోకి తెస్తారు. అలాగే వివిధ రకాల పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక విభాగాలు, సైలెంట్ రీడింగ్ రూమ్స్, రిఫరెన్స్ విభాగాలు ఈ లైబ్రరీ ప్రత్యేకతలుగా ఉంటాయి. కేవలం విద్యార్థుల కోసమే కాకుండా వివిధ రంగాలపై పరిశోధన పత్రాలు, గణాంకాలు, ఈ-జర్నల్స్, ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్ ప్రాచీన గ్రంథాలన్నీ అందుబాటులో ఉంటాయి. ఇంతే కాకుండా వయసు రీత్యా వివిధ కేటగిరీల వారీగా కూడా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసే ప్రణాళిక ఉంది. చిన్నారుల కోసం కిడ్స్ కార్నర్, సీనియర్ సిటిజన్‌ల కోసం రిఫరెన్స్ లాంజ్, సాంకేతిక విద్యలో రీసెర్చి కోసం ఐటీ, సాఫ్ట్‌వేర్ సంబంధిత పుస్తకాలతో కూడిన విభాగాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు.

అమరావతి ఖ్యాతిని ఇనుమడించేలా...

ప్రపంచశ్రేణి నగరాల్లో ఒకటిగా బాసిల్లనున్న అమరావతికి ఈ సెంట్రల్ లైబ్రరీ పెద్ద వనరుగా ఉపకరించనుంది. రాబోయే రోజుల్లో ఈ లైబ్రరీ వేదికగా అంతర్జాతీయ సదస్సులు, సాహిత్య ఉత్సవాలు, మరెన్నో పరిశోధనా కార్యక్రమాలు జరుగుతాయి. అమరావతిని జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ గ్రంథాలయం ఎంతో దోహదపడనుంది.

బీచ్ ఫెస్టివల్ వాయిదా

● భారీ వర్షాల సూచనల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తున్నట్లు టూరిజం విభాగం జిల్లా అధికారి నాగి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కూడా బీచ్ పండుగకు హాజరవుతారని గతంలోనే యంత్రాంగం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఏర్పాట్లను కూడా ప్రారంభించారు. అయితే ఈ వారంలో అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీచ్ ఫెస్టివల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి సోమవారం సూర్యలంక తీరానికి వచ్చారు. ఈ నెల 26, 27వ తేదీల్లో వాతావరణ పరిస్థితులపై చర్చించారు. ప్రతికూల పరిస్థితుల్లో బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడం కష్టమేననే అభిప్రాయాన్ని ఎండీ ముందు జిల్లా యంత్రాంగం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇవే అంశా లను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో వేరే తేదీల్లో బీచ్ పండుగను నిర్వహిస్తామని పర్యాటకశాఖ తెలిపింది.


సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ వినోద్‌కుమార్

బ్రహ్మోత్సవాల్లో సామాన్యులకే ప్రాధాన్యం

» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

కలియుగ వైకుంఠం తిరుమల బ్రహ్మోత్సవ సంరంభానికి సిద్ధమైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక మేరకు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల పవిత్రత కాపాడుకుంటూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దానికి అనుగుణంగా బోర్డు సభ్యులు, అధికారులందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నాం. ఎస్ఎస్‌డీ (స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్ల కోటా పెంపుతో పాటు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్లు అధికంగా ఇచ్చాం. నేరుగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకే అధిక సంఖ్యలో గదులు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వాహన సేవలు వీక్షించేందుకు మాడవీధుల్లోకి వచ్చే, వెలుపల ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాల వితరణ, 110 మందితో వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాం.

పటిష్ఠ భద్రత


సెక్యూరిటీ పేరుతో మాడ వీధుల్లోకి భక్తులు ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పెట్టకూడదని నిర్ణయించాం. భద్రత కల్పనలో లోపాలు లేకుండా దాదాపు 6 వేల మందితో సేవలందించాలని ఆదేశాలిచ్చాం. గరుడ సేవ రోజు అదనంగా మరో 1,300 మంది బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిద్వారా రియల్ టైంలో మానిటర్ చేస్తాం. కమాండ్ కంట్రోల్ రూం నుంచి అన్నిటినీ నిరంతరాయంగా పరిశీలిస్తుంటారు.

సమన్వయ లోపాలకు చెక్

టీటీడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో కొన్ని బృందాలను ఏర్పాటు చేశాం. వారు మాడ వీధుల్లోని గ్యాలరీల వద్ద సెక్టార్లవారీగా విధులు నిర్వహిస్తారు. భక్తులతో నేరుగా మాట్లాడతారు. ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తారు. శ్రీవారి సేవకులు కూడా గ్యాలరీల్లోనే ఉంటూ భక్తులకు సేవలందించడంతో పాటు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తారు. ఈసారి సమన్వయ లోపానికి ఆస్కారం లేదు.

రూ.25 కోట్లతో ఏర్పాట్లు

సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా సంతృప్తికర, ఆధ్యాత్మిక, ఆహ్లాదకర సంతోషాన్ని కల్పించడమే మా ప్రధాన లక్ష్యం. గతానికంటే భిన్నంగా రూ.25 కోట్లతో ఈసారి ఏర్పాట్లు చేపట్టాం. రూ.9.50 కోట్లతో ఇంజనీరింగ్ పనులు, రూ.5.30 కోట్లతో విద్యుద్దీపాలంకరణలు చేపట్టాం. దాతల సహకారంతో మరో రూ.3.50 కోట్లతో 60 టన్నుల పుష్పాలతో అలంకరణలు చేయనున్నాం. అన్న ప్రసాదాలు, ఇతర ఖర్చులకు రూ.25 కోట్లతో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేపట్టాం.



4 వేల వాహనాలకు పార్కింగ్ సిద్ధం

4 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ప్రదేశాలను తిరుమలలో సిద్ధం చేశాం. అంతకు మించి వస్తే తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తాం. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ 1,900 ట్రిప్పులు, గరుడ సేవ రోజున మూడు వేల ట్రిప్పులను తిప్పేందుకు ఆర్టీసీ ప్లాన్ చేసింది.

కార్నర్ పాయింట్స్ నుంచి దర్శనం

మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.80 నుంచి దాదాపు 2 లక్షల మంది కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముంటుంది. రెండేళ్ల నుంచి మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను క్యూలైన్ ద్వారా అనుమతించి దర్శనం కల్పిస్తున్నాం. 45 నిమిషాల పాటు వాహనాన్ని కార్నర్ పాయింట్లలో ఉంచి హోల్డింగ్ పాయింట్ల ద్వారా భక్తులను అనుమతించి దర్శనం చేయిస్తాం. గతేడాది ఈ పాయింట్ల ద్వారా 16 వేల మందికి దర్శనం చేయిస్తే ఈసారి దాదాపు 30 వేల మందికి దర్శనం చేయించేలా ప్రణాళిక రూపొందించాం.

298 కళా బృందాల ప్రదర్శనలు

దాదాపు 28 రాష్ట్రాల నుంచి 298 బృందాలు ఉత్సవాల్లో పాల్గొంటాయి. గరుడ వాహన సేవ రోజు 20 రాష్ట్రాల నుంచి 37 బృందాలు ప్రదర్శనలు ఇస్తాయి. 20 హెల్ప్ డెస్క్‌ల ద్వారా ఐదు భాషల్లో ప్రసారాలు ఇవ్వడంతో పాటు టీటీడీ అందిస్తున్న సేవలను భక్తులకు వివరిస్తాయి.

పూర్వ జన్మ సుకృతం

రెండవసారి టీటీడీ ఈవోగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఒక్కసారి ఈవో కావడమే పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటిది నేను రెండోసారి ఈవో అయ్యాను. మొదటిసారి ఈవోగా నియమితమైనప్పుడు చాలా మంది నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ అంటూ చర్చలు పెట్టారు. కానీ రెండోసారి ఈవోగా వస్తుంటే చాలా మంది స్వాగతించారు. ఇప్పటికే నాలుగు బ్రహ్మోత్సవాలు పూర్తిచేసిన అనుభవంతో ఐదో బ్రహ్మోత్సవాన్ని వైభవంగా, వివాదరహితంగా నిర్వహిస్తాననే గట్టి నమ్మకముంది.

ఆన్‌లైన్ అమ్మకం..బాదుడు!

(5వ పేజీ తరువాయి)

70 మంది ఈ-కామర్స్ సంస్థల ద్వారానే వస్తువులు కొనుక్కుంటున్నారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వీరందరి నుంచి ఈ సంస్థలు వివిధ రూపాల్లో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయి.



రకరకాల ఫీజుల మోత..!

ఒక ఈ-కామర్స్ సంస్థ తన వెబ్‌సైటును వినియోగించుకున్నందుకు ప్లాట్‌ఫాం ఫీజు కింద రూ.5 నుంచి రూ.15, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ఫీజు పేరుతో రూ.49 నుంచి రూ.59 వసూలు చేస్తోంది. అలాగని ఆర్డర్ పెట్టిన వస్తువు రాకపోతే మాత్రం సంస్థ బాధ్యత తీసుకోవడం లేదు. వీటితోపాటు ఆఫర్ హోల్డింగ్ ఫీజు పేరుతో రూ.149, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద పికప్ చార్జీ పేరుతో రూ.99 నుంచి రూ.199 వరకూ వసూలు చేస్తోంది. తాజాగా మరో సంస్థ కూడా ఇదే తరహాలో ఫీజుల వసూలు మొదలు పెట్టింది.

● వస్తువు రాకుంటే ఫీజులు గల్లంతే..!

ఇంత ఖర్చు చేసి ఒక వస్తువును ఆర్డర్ చేస్తే అది వినియోగదారుడి చేతికి అందితే అదృష్టమే. అందలేదంటే ఆ ఫీజులు మొత్తం పోయినట్లే లెక్క! ఆర్డర్ చేసిన తర్వాత ఆ వస్తువు అమ్మకందారు పంపించకపోయినా, అతడే ఆర్డర్ క్యాన్సిల్ చేసినా సరే.. అదనంగా చెల్లించిన ఫీజులు తిరిగి రావు. కేవలం వస్తువు ఖరీదు మాత్రమే వస్తోంది. దీంతో వినియోగదారులు అనేక మంది లబోదిబోమంటున్నారు. సేవలను అందించామనే పేరుతో ఈ కామర్స్ సంస్థలు ఫీజులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు వేల సంఖ్యలో వస్తున్నాయి.

● రిటర్న్ విండో మూసివేత..

ఈ-కామర్స్ సంస్థ లు క్రమంగా రిటర్న్ విండోను మూ సేస్తున్నాయి. తొలి నాళ్లలో నెల రోజులపాటు రిటర్న్ ఆప్షన్ అందు బాటులో ఉండేది. ఈ సమయంలో ప్రొడక్టుకు ఏదైనా సమస్య వస్తే తిరిగి పంపించే అవకాశం ఉండేది. తిరిగి కొత్త ప్రొడక్టును గానీ,



లేదా చెల్లించిన మొత్తాన్ని కానీ రీఫండ్ చేసేవారు. తర్వాత ఈ సమయాన్ని పక్షం, వారం రోజులకు కుదించారు. ఇప్పుడైతే పూర్తిగా ఆ ఆప్షన్‌ను ఎత్తేశారు. రీప్లేస్‌మెంట్ అవకాశాన్ని మాత్రమే ఇస్తున్నారు. ఇందులో కూడా సర్వీస్ సెంటర్ రీప్లేస్‌మెంటు ఆప్షన్‌ను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నారు. అంటే వస్తువు ఒకసారి వినియోగదారుడి చేతికి చేరిదంటే ఆ వస్తువుతో ఈ-కామర్స్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నమాట! ఆ వస్తువును తీసుకుని సంబంధిత కంపెనీ సర్వీస్ సెంటర్ చుట్టూ తిరగాల్సిందే! ఆథరైజ్డ్ సెల్లర్ దగ్గర తీసుకున్న ప్రొడక్టు అయితేనే సర్వీస్ సెంటర్ సేవలు అందిస్తుంది. థర్డ్ పార్టీ సెల్లర్ దగ్గర తీసుకుంటే మాత్రం ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండడం ఎంతైనా అవసరం.

విజ్ఞాన్‌లో కొనసాగుతున్న జాతీయ చెస్ చాంపియన్‌షిప్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది బరిలోకి దిగినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కె జగదీష్ వెల్లడించారు. వారిలో 391 మంది రేటెడ్ ప్లేయర్లు ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సాహూను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు.


పోటీల్లో పాల్గొన్న చెస్ క్రీడాకారులు

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

యడ్లపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను ఈ నెల 23 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జగ్గాపురం ఎంపీపీఎస్ (హెచ్ఈ) పాఠశాలలోను, యడ్లపాడు-1 గ్రామ సచివాలయంలో ఈ ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవడం, ఆధార్‌తో మొబైల్ నంబరు అనుసంధానం, ఐదేళ్ల దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ఈ క్యాంపులో చేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇన్‌చార్జి సీఐగా బాలాజీ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా నరసరావుపేట క్రైమ్ సీఐగా పనిచేస్తున్న పి.బాలాజీని ఎస్పీ రామకృష్ణ నియమించాడు. గతంలో పనిచేసిన శోభన్‌బాబు బదిలీపై ఒంగోలు వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి సీఐగా విధుల్లో చేరారు.

దాబాల్లో మద్యం సేవిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తాం: ఎక్సైజ్ సీఐ

వినుకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దాబాల్లో మద్యం సేవిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఉదయం దాబా యజమానులను స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి పిలిచి దాబాల్లో ఫుడ్‌లైసెన్స్, ఫైర్ లైసెన్స్‌లు తీసుకోవాలని, నిబంధనలకు అనుగుణంగా లేకుంటే చర్యలు తీసుకోవటం జరుగుతుందని సీఐ హెచ్చరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీజీబీ చీఫ్ విజిలెన్స్ హర్ష బెహత

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2025 సోమవారం నిర్వహించారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. విజిలెన్స్ మనందరి బాధ్యత అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీజీబీ చీఫ్ విజిలెన్స్ హర్ష బెహత, డైరెక్టర్ కే నాసరయ్య, రీజినల్ మేనేజర్ పీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద ఏఎంరెడ్డి కళాశాల విద్యార్థులు

గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సందర్శించిన ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమల పర్యటనలో భాగంగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణరెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఈపూరు,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలంటూ ఈపూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయితీ పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా చేపట్టారు. కార్మికుల ఆంతోళనకు ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, కే మల్లికార్జున, పీ వెంకటేశ్వర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలో 17వ విడత సోషల్ ఆడిట్ జరగనున్న నేపథ్యంలో సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా క్లస్టర్ ఏపీడీ భూసిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఆడిట్‌కు వచ్చిన సిబ్బందికి ఉపాధి సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు, టీఏలు, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 25న రణభేరి బహిరంగ సభ జరుగుతుందని యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం.మోహన్‌రావు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యాలయంలో రణభేరి సభ పోస్టర్ ఆవిష్కరించారు.

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట మండలం లింగంగుంట్ల శంకర భారతీపురం హైస్కూలు విద్యార్థులు బాపట్ల జిల్లా సూర్యలంక సముద్రతీరంలో చెత్త ఏరివేత కార్యక్రమంలో పాల్గొన్నట్లు పల్నాడు జిల్లా మానవ వనరుల కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఆర్గనైజర్ కమిషనర్ బట్టు రవీంద్రనాథ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: స్థానిక 38వ వార్డు పోలిరెడ్డిపాలెంలోని ఇంటూరివారివీధిలో రూ.9.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జె.సుజాత, జె.వినాయకరావు, మున్సిపల్ డీఈ రహీమ్, ఏఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టేందుకు వెళుతున్న సందర్భంగా సోమవారం ఆర్టీసీ టీఎన్‌టీయూసీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. భీమవరం డీఆర్వో పనిచేస్తూ పదోన్నతిపై నెల్లూరు వెళుతున్న సందర్భంగా ఆయన ఇక్కడ కొద్దిసేపు ఆగారు.

ఘనంగా దసరా మహోత్సవాలు ప్రారంభం

● అమ్మవారికి విశేష అలంకారాలు
● దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



నరసరావుపేట బీమలింగేశ్వర స్వామి ఆలయంలో బాలగా, లింగంగుంట్ల అయ్యప్పస్వామి ఆలయంలో శైలపుత్రదేవిగా, బోయపాలెంలో, శావల్యాపురంలో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

నరసరావుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అలయాలకు తరలివచ్చి అమ్మవారి అలంకారాలను దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా కేంద్రం, నరసరావుపేటతో పట్టణాల్లో, గ్రామాల్లో పార్వతి అమ్మవారికి విశేషంగా అలంకరించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. నరసరావుపేటలోని పాతూరు గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి బాల అలంకారం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి శంకరమఠంలో శారదాంబ అమ్మవారికి బ్రహ్మి అలంకారం చేశారు. సత్తెనపల్లి రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, చౌడేశ్వరి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

● కోటప్పకొండ (నరసరావుపేట రూరల్): నరసరావుపేట మండలం కోటప్పకొండలోని భువనేశ్వరి అమ్మవారిని అమ్మవారిని బాలత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. భక్తులకు ఆలయకమిటీ సభ్యులు చెన్నంశెట్టి శివ లక్ష్మయ్య అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నరసరావుపేట మండలం లింగంగుంట్లలో ఎన్ఎస్‌పి కాలువ వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శైలపుత్రదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు ఆంజనేయ గురుస్వామి తెలిపారు.

● రొంపిచర్ల: వాసవి అమ్మవారి దేవస్థానంలో జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజల్లో దంపతులు, కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రుద్రాభిషేక పూజలను పేటేటి వేమలరావు శర్మ నిర్వహించారు.

● వినుకొండ: స్థానిక గీతాంజలి స్కూల్స్‌లో దసరా వేడుకల సందర్భంగా చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణవేణి, డైరెక్టర్ వై లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వినుకొండ: వినుకొండ మండలం కోటప్పనగర్‌లో దసరా నవరాత్రులు సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటుచేసిన అమ్మవారిని దర్శించుకున్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పూజలు నిర్వహించారు. వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మసెంటర్‌లోని శ్రీకన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో, ఎన్ఎస్‌పీ కాలనీలోని లలితాంబిక దేవాలయంలో నవరాత్రి పూజలు ప్రారంభించారు.

● యడ్లపాడు: మండలంలోని బోయపాలెం పార్వతీదేవి ఆలయం, హరిహరక్షేత్రంలోని పార్వతీదేవి అమ్మవారు, కొత్తపాలెం, కొండవీడు, లింగారావుపాలెం, తిమ్మాపురం, ఉన్నవ, దింతెనపాడు, జగ్గాపురం గ్రామాలలోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

● శావల్యాపురం: శావల్యాపురం రైల్వేస్టేషన్ దారిలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి తొలి రోజు అమ్మవారికి బాల త్రిపురసుందరీదేవి అలంకరణ చేసి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద నున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, మావురాల ఎల్లమ్మ దేవాలయంలో ధర్మకర్త గోనుగుంట్ల ఏడుకొండలు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళ శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీ, కొచ్చర్ల శ్రీఅంకాళ పరమేశ్వరీ, పార్వతీ దేవిలను సోమవారం పువ్వులతో అందంగా అలంకరించారు.



కోటప్పనగర్‌లో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 163 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్

యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టండి: గోపిరెడ్డి

యూరియా బ్లాక్ మార్కెట్‌ను తక్షణమే అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యూరియా దొరక్క రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తపల్లి, రెడ్డిపాలెం, సంతగుడిపాడులలో యూరియా సంబందిత రైతులకు ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ పల్నాడు రైతు విభాగం అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పడాల శివారెడ్డి, రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 114 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 22, (ఆంధ్రజ్యోతి), పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి వివిధ అంశాలకు సంబంధించిన 114 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రధాన ముఖ ద్వారం వితరణ

వినుకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్పీ కాలనీలోని జడ్పీహెచ్ పాఠశాలకు ముఖద్వారంను దాత ముత్తినేని యశోధరావు సహకారంతో నిర్మించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వీరప్పయ్య సోమవారం తెలిపారు. వినుకొండ మండలం, నీలగంగవరం గ్రామానికి చెందిన ముత్తినేని యశోధరావు వారి తల్లిదండ్రులు ముత్తినేని నాసరయ్య, వెంకటమ్మల జ్ఞాపకార్థం రూ.80,000 విలువైన గేటును ఏర్పాటు చేశారు. ప్రధాన గేటు ఏర్పాటు చేసినందుకు వార్డెన్ రేణుకమ్మ, పాఠశాల హెచ్ఎం దాతకు, పీడీ రాధాకృష్ణమూర్తిలకు ధన్యవాదాలు తెలిపారు.



గేటును అందచేసిన ముత్తినేని యశోదరావు, పీడీ రాధాకృష్ణ

నకిలీ పత్రాలతో భూమి అమ్మివేశారంటూ ఫిర్యాదు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో భూమి అమ్మివేశారంటూ మండలంలోని చాట్రగడ్డపాడుకు చెందిన గోగిరెడ్డి హనుమంతరెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశాడు. తాము వృద్ధులం కావడంతో అక్రమార్కులు ఈ దురాగతానికి పాల్పడినట్లు హనుమంతరెడ్డి భార్య సీతారావమ్మ వాపోయారు. ఓ వైసీపీ నాయకుడు భూమిని స్వాధీనం చేసుకుని, సాగు చేస్తుండటంపై గత నెల 25వ తేదీన చీకటీగలపాలెం సచివాలయం గ్రీవెన్స్‌లోను, వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామన్నారు. 15రోజుల వ్యవధిలో పట్టణ పోలీసులు చర్య తీసుకోకపోవడంతో కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు చర్యలు చేపట్టాలంటూ పట్టణ పోలీసులను ఆదేశించారు.

రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ నాయకుల దుష్ప్రచారం

● శావల్యాపురం సొసైటీ చైర్మన్ విశ్వనాథం

శావల్యాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల రైతులకు యూరియా అందడం లేదంటూ వైసీపీ నేతలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభమయ్యాక శావల్యాపురం సొసైటీలో 270 టన్నులు, కారుమంచి సొసైటీలో 280 టన్నులు, మన గ్రోమోర్‌లో 314 టన్నులు చొప్పున మొత్తం 864టన్నులు ఎరువులు మండలంలోని రైతులకు అందజేసినట్లు అధికారులు ప్రకటించినా వైసీపీ నేతలు మాత్రం ఎరువులే అందడం లేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, సొసైటీ డైరెక్టర్లు గోనుగుంట్ల నాగరాజు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సొలసలో స్వచ్ఛరథం ప్రారంభం

యడ్లపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సొలస గ్రామంలో స్వచ్ఛ రథంను అధికారులు సోమవారం ప్రారంభించారు. స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి ఒక స్వచ్ఛ రథాన్ని కేటాయించిందన్నారు. ప్రతిరోజు ఒక గ్రామంలో ఈ రథం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు నిత్యం తమ ఇళ్ళ నుంచి వచ్చే వ్యర్థాలను తడి పొడి చెత్తలుగా వేరుచేసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్, ఇనుము, స్టీలు, అల్యూమినియం, అట్టపెట్టెలు వంటి ఘన వ్యర్థాలను తీసుకుని దానికి సమానమైన నిత్యావసరాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమలో డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి పాల్గొన్నారు.



స్వచ్ఛ రథం వద్ద ఘన వ్యర్థాలను తీసుకుని వస్తువులు అందజేస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు వీరారెడ్డి

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

యడ్లపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులో ఆర్యవైశ్య సంఘ భవనాన్ని అక్రమంగా తన భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేసిన మద్దుల రమణారావుపై ఆ సంఘ నాయకులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్వీకులు దానం ఇచ్చిన ఆ స్థలంలో భవనాన్ని నిర్మించగా ఉప కోశాధికారి మద్దుల రమణారావు తన పేరున పన్ను సృష్టించి తన భార్య పేరుతో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశాడని వివరించాడు. ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

చిలకలూరిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో పట్టణంలోని భావన రుషినగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ వింజమూరి ఆదినారాయణ (39) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం పసుమర్రు గ్రామ పరిధిలోని గొర్రెల మండీ సమీపంలోని పొలాలలో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి శవ పంచినామా నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పర్వతారోహణకు శంకరభారతీపురం విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర భారతీపురం హైస్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి పర్వతారోహణ శిబిరానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం. పార్వతి తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి అరకువ్యాలీలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పర్వతారోహణ శిబిరంలో శంకరభారతీపురం విద్యార్థులు మల్లా లక్ష్మీనారాయణ, ఎం. వెంకటసాయిరెడ్డి పాల్గొననున్నట్లు ఎన్‌సీసీ అధికారి ఫాతిమా తెలిపారు.



నరసరావుపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం: శశికుమార్

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపు హర్షణీయమని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ సవరణలు దేశవ్యాప్తంగా ప్రారంభమైన సందర్భంగా నరసరావుపేట పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ శ్రేణులు నరసరావుపేట పట్టణంలో ప్రకాష్ నగర్‌లోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయం నుంచి స్టేషన్ రోడ్డు మీదుగా మల్లమ్మ సెంటర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ కొక్కెర శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.